క్లుప్తంగా

సభ విజయవంతం చేయాలి



ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు

ఆసిఫాబాద్‌రూరల్: లక్ష డప్పులు, వెయి గొంతుల మహాసభను విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ జాతీయ నాయకుడు కేశవ రావు అన్నారు. బుధవారం మండలంలోని చిర్రకుంట గ్రామంలో గ్రామ కమిటీలు ఏర్పాటు చేసిన ర్యాలీకి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఫిబ్రవరి 7న హైదరాబాద్‌లో మందకృష్ణమాదిగ ఆధ్వర్యంలో నిర్వహించే సభకు భారీగా హాజరు కావాలన్నారు. కార్యక్రమంలో నాయకులు మహేశ్, వెంకటేశ్, మల్లేశ్, సంతోష్, సాయి, గ్రామస్తులు పాల్గొన్నారు.

రోడ్డుకు మరమ్మతు

పెంచికల్‌పేట్: కమ్మర్‌గాం నుంచి మురళీగూడ వరకు ఉన్న ప్రధాన రహదారి మరమ్మతుల పనులను సోమవారం కాంగ్రెస్ నాయకులు ప్రారంభించారు. గ్రామానికి వెళ్లే రహదారి మరమ్మతుల కోసం రూ. 3 లక్షలు కేటాయించినట్లు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు కృష్ణ, ప్రభాకర్, శంకర్‌గౌడ్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ఆసిఫాబాద్: జిల్లా కేంద్రంలోని పైకాజీనగర్ ప్రాంతంలో గురువారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని ట్రాన్స్‌కో ఏఈ లక్ష్మీరాజం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్‌లైన్ మరమ్మతు పనుల్లో భాగంగా విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

యువతులు పోటీల్లో రాణించాలి



బహుమతులు ప్రదానం చేస్తున్న నాయకులు

కౌటాల: యువతులు అన్ని రంగాల్లో రాణించాలని కౌటాల మాజీ ఎంపీపీ బసర్కార్ విశ్వనాథ్ అన్నారు. మండలంలోని ముత్తంపేట గ్రామంలోని బుద్ధవిహార్‌లో మంగళవారం భారతీయ బౌద్ధ మహాసభ ఆధ్వర్యంలో మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. మొదటి బహుమతి గెలుపొందిన సరోజ, ద్వితీయ బహుమతి అర్పిత, తృతీయ బహుమతి అర్చనలకు బహుమతులు అందజేశారు. గ్రామీణ ప్రాంత మహిళలు అన్ని రంగాల్లో పోటీపడాలన్నారు. బౌద్ధ మహాసభ మండలాధ్యక్షుడు బండురావ్, ఏమాజీ, దుర్గం వెంకటేశ్, ధనరాజ్, శ్రీనివాస్, రవి, శంకర్ పాల్గొన్నారు.

మహిళల ఆర్థికాభివృద్ధికి కృషి



చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే

ఉట్నూర్‌రూరల్: మహిళల ఆర్థికాభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తోందని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో 26 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ చేశారు. పేద కుటుంబాలకు కల్యాణలక్ష్మి వరంగా మారిందన్నారు. పేదల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. కార్యక్రమంలో నాయకులు ఖయ్యూం, లాజర్, చంద్రయ్య, ఎక్బాల్, రాజేశ్, ఇమ్రాన్, జుబేర్ పాల్గొన్నారు.

చెక్కుల పంపిణీ..

సిరికొండ: మండల కేంద్రంలో బుధువారం ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ ఖానాపూర్ నియోజకవర్గంలోని గ్రామాలకు సంబంధించిన 16 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం రైతులకు రైతుభరోసా, భూమి లేని పేదలకు ఇందిరమ్మ ఆత్మీయ పథకం ద్వారా రూ. 12 వేలు, రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్ల పథకలను అమలు ఈనెల 26లోపు అమలు చేస్తుందన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ తుకారం, ఎంపీడీవో రవీందర్, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

'నిరుద్యోగ భృతి అమలు చేయాలి'

సిరికొండ: ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు నిరుద్యోగ భృతిని వెంటనే అమలు చేయాలని బీఆర్ఎస్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకుడు పెంటన్న మాట్లాడుతూ.. యువతీ, యువకులకు నిరుద్యోగ భృతి అమలు చేస్తాం అన్ని దొంగ హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ హామీలను విస్మరించిందని ఆరోపించారు.

ఘనంగా సంక్రాంతి

జిల్లా వ్యాప్తంగా మూడు రోజుల పాటు సంక్రాంతి వేడుకలను ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. మహిళలు వేసిన రంగవల్లులు ఆకట్టుకున్నాయి. పలు గ్రామాల్లో ముగ్గుల పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. చిన్నారులు, యువకులు గాలి పటాలతో సందడి చేశారు.

- ఆకట్టుకున్న ముగ్గులు
- మూడు రోజులు సందడిగా గడిపిన ప్రజలు



కెరమెరి: ముగ్గులు పోటీల్లో పాల్గొన్న మహిళలు

కెరమెరి: మండలంలోని చౌపన్‌గూడ గ్రామంలో బుధవారం ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఇందులో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో పెద్దలు ఆత్రం బొజ్జిరావు, ఆత్రం కుసుంబ్‌రావు, దండు, మోతిరాం, కుర్సెంగ యాదోశావ్, కాత్లె జంగు, తుకారాం పాల్గొన్నారు.

వాంకిడి: మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రి మైదానంలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా డీసీసీ అధ్యక్షుడు విశ్వప్రసాద్, మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు పాల్గొని మాట్లాడారు. మహిళల సాధికారతకు రాష్ట్ర ప్రభుత్వం అనేక పథకాలను తీసుకువస్తుందన్నారు. అనంతరం గెలుపొందిన సెండె పూజ, సౌమ్య, లావణ్యలకు నగదు బహుమతులు అందజేశారు. నాయకులు గుర్నులె నారాయణ, దుర్గం ప్రశాంత్, దీపక్ ముండె, విలాస్ ఖోబ్రగడె, ఉష, జైరాం పాల్గొన్నారు.

దహెగాం: చిన్నా పెద్దా తేడా లేకుండా సంక్రాంతి సంబురాలను ఘనంగా జరుపుకున్నారు. బుధవారం కనుమ సందర్భంగా మహిళలు ఒకరొకొకరు వాయినాలు ఇచ్చుకున్నారు. చిన్నారులు గాలి పటాలు ఎగురవేశారు.

రెబ్బెన: అన్ని గ్రామాల్లో సంక్రాంతి పండుగను ఘనంగా జరుపుకున్నారు. ప్రజలు చకినాలు, అరిసెలు పిండి వంటకాలు చేసి అనందంగా గడిపారు. ఇళ్ల ఎదుట రంగురంగులతో అందమైన ముగ్గులు వేసి మహిళలు మురిసిపోయారు. ముగ్గుల మధ్యలో గొబ్బెమ్మలు ఏర్పాటు చేసి పూజలు చేశారు.

ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లా కేంద్రంలో వాసవి క్లబ్ ఆధ్వర్యంలో చిన్నారులకు పతంగులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా శ్రీ సరస్వతి శిశుమందిర్‌లో ఆవరణలో చిన్నారులు పతంగులు ఎగురవేశారు. పాఠశాల ఆవరణలో పతంగులు గాలిలో ఎగురవేయడంతో సందడిగా నెలకొంది. శ్రీనివాస్, కృష్ణమూర్తి, వేణుగోపాల్, రవీందర్, రమేశ్, కిషోర్ పాల్గొన్నారు.

ఆసిఫాబాద్‌రూరల్: మండలంలోని గుండిలో ముగ్గుల పోటీలు, బాబాపూర్‌లో ఎండ్ల బండి పందెలు, కబడ్డీ పోటీలు నిర్వహించారు. పోటీల్లో గెలుపొందిన వారికి కాంగ్రెస్ డీసీసీ అధ్యక్షుడు విశ్వప్రసాద్, ఎమ్మెల్యే కోవ లక్ష్మి, మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు నగదు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ మల్లి కార్జున్, సింగిల్ విండో చైర్మన్ అలీబిన్, రవీందర్, చరణ్, దత్తు, బాలేశ్వర్ గౌడ్, శ్యాం, రమేశ్ పాల్గొన్నారు.

కౌటాల: ఆయా గ్రామాల ప్రజలు సంక్రాంతి పండుగను ఘనంగా జరుపుకున్నారు. ఇళ్లను విద్యుత్ దీపాలతో అలకరించారు. మహిళలు, యువతులు ఉదయం నుంచే ఇంటి ఎదుట ముగ్గులు వేశారు. శివాలయం, రామాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. చిన్నారులు పోటిపడి గాలిపటాలు ఎగురవేశారు.



వాంకిడి: బహుమతులు ప్రదానం చేస్తున్న నాయకులు



ఆసిఫాబాద్‌అర్బన్: పతంగులు పంపిణీ చేస్తున్న నాయకులు



ఆసిఫాబాద్‌రూరల్: బహుమతులు అందజేస్తున్న ఎమ్మెల్యే కోవలక్ష్మి



కౌటాల: ముగ్గు వేస్తున్న మహిళలు

ఇచ్చిపుచ్చుకున్న వాయినాలు



వాయినాలు ఇచ్చిపుచ్చుకుంటున్న మహిళలు

కెరమెరి: మకర సంక్రాంతి సందర్భంగా బుధవారం మండల కేంద్రంలో మహిళలు వాయినాలు ఇచ్చిపుచ్చుకున్నారు. సంక్రాంతి తర్వాత వచ్చే రోజు కనుమ సందర్భంగా మరో రెండు రోజుల వరకు వాయినాలను మహిళలు ఇచ్చిపుచ్చుకోవడం ఆనవాయితీగా వస్తుంది. మహిళలు ఒకరి ఇళ్లకు మరొకరు వెళ్లి నుదుట తిలకం దిద్ది తమకు ఇష్టమైన వస్తువులతో పాటు బియ్యం, గోధుమలు, క్యారెట్, చెరుకు, జామ, రేగి, తదితర వస్తువులను ఇచ్చిపుచ్చుకున్నారు.

సన్మానం

కౌటాల: మండల కేంద్రంలోని ఆరె సంక్షేమ సంఘం భవనంలో మాలి సంఘం నూతన రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఎన్నికైన ఆదే వసంత్‌రావ్, జిల్లా ప్రధాన కార్యదర్శి నికోడే గంగరాంను ఆరె సంఘం, బీఆర్ఎస్ నాయకులు బుధవారం సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సంఘాల అభివృద్ధికి అందరు ముందుండాలన్నారు. మాలి కులస్తుల సమస్యలను పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో ఆరె సంఘం జిల్లా అధ్యక్షుడు బొట్టుపల్లి జైరాం, వసంత్‌రావు, వానుపటేల్, మోతిరాం, రాధేశ్యాం, బండుపటేల్, వెంకటేశ్, గోవింద్‌రావు, దేవాజీ, ఆనంద్, సందీప్, రాంప్రసాద్ పాల్గొన్నారు.

అర్హులైన లబ్ధిదారులను గుర్తించాలి

కెరమెరి: ఈనెల 21 నుంచి 23 వరకు గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించి అర్హులైన లబ్ధిదారులను ఎంపిక చేయాలని జిల్లా పరిషత్ సీఈవో లక్ష్మీనారాయాణ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. రైతు భరోసా, ఆత్మీయ భరోసా, ఇందిరమ్మ ఇల్లు, రేషన్ కార్డుల అంశాలపై ఈనెల 16 నుంచి 19 వరకు సర్వే పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో అంజద్ పాషా, తహసీల్దార్ దత్తుప్రసాద్, డిప్యూటి తహసీల్దార్ సంతోష్‌కుమార్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా పరిషత్ సీఈవో

వాంకిడి: ప్రభుత్వ పథకాలకు అర్హుల ఎంపిక ప్రక్రియపై బుధవారం మండల కేంద్రంలోని రైతు వేదికలో పంచాయతీ కార్యదర్శులు, రెవెన్యూ సిబ్బంది, ఉపాధిహామీ సిబ్బంది, ఏఈవోలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మండల ప్రత్యేకాధికారి రాథోడ్ బిక్కు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన రైతుభరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, ఇందిరమ్మ ఇల్లు, రేషన్ కార్డుల మంజూరు ప్రక్రియను క్షేత్రస్థాయిలో పరిశీలించాలన్నారు. ఎలాంటి తప్పిదాలు లేకుండా అర్హులను ఎంపిక చేయాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ రియాజ్ అలీ, ఎంపీడీవో ప్రవీణ్ కుమార్, ఎంపీవో జావిద్, ఏపీవో శ్రావణ్‌కుమార్ పాల్గొన్నారు.

కోడి పందేల స్థావరంపై దాడి

చింతలమానెపల్లి: మండలంలోని రణవెల్లి గ్రామ శివారులో కోడిపందేల స్థావరంపై దాడి చేసినట్లు ఎస్సై ఇస్లావత్ నరేశ్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం కోడిపందేల స్థావరంపై నిర్వహించిన దాడుల్లో ముగ్గురిపై కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. వీరి నుంచి మూడు ద్విచక్రవాహనాలు, రెండు కోడి పుంజులు, రూ. 1,550 నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై వివరించారు.

కౌటాలలో..

కౌటాల: మండలంలోని జనగాం గ్రామ సమీపంలో మంగళవారం కోడి పందేలు నిర్వహిస్తుండగా ఎస్సై మధుకర్ ఆధ్వర్యంలో పోలీసులు దాడి చేసి పట్టుకున్నారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామంలోని ప్రకృతి వనం సమీపంలో కోడి పందేలు నిర్వహిస్తున్నారనే పక్క సమాచారంతో దాడి చేసినట్లు తెలిపారు. దాడిలో తొమ్మిది మందిని పట్టుకొని వారి వద్ద నుంచి మూడు పందేం పుంజులు, రూ. 3900 నగదు, కోడి కత్తులు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. కె.మహేశ్, బి.చందు, సంతోష్, పుల్లికరావు, సత్తన్న, పాండురంగ్, రవీందర్, భీంరావ్, తిరుపతిపై కేసులు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.

అమెరికాలో సంక్రాంతి సందడి

కౌటాల: అమెరికాలో సంక్రాంతి సంబురాలను ఘనంగా జరుపుకున్నారు. కౌటాల మండల కేంద్రానికి చెందిన సింధోర తన కుటుంబంతో అమెరికాలో ఉంటున్నారు. సంక్రాంతి సందర్భంగా వారి ఇంట్లో ఆమె తన భర్త గోపాలకృష్ణ, ఇద్దరు కుమారులతో కలిసి భక్తిశ్రద్ధలతో భోగి, సంక్రాంతి, కనుమను జరుపుకున్నారు. సంప్రదాయాలు, సంస్కృతి తమ పిల్లలకు నేర్పిస్తామని ఆమె తెలిపారు.



ముగ్గు వేస్తున్న సింధోర

'ఇందాపూర్' ముస్తాబు

- పోతురాజు, ధర్మరాజు ఆలయంలో ప్రత్యేక పూజలు
- నేడు, రేపు కొనసాగనున్న కార్యక్రమాలు
- పలు ప్రాంతాల నుంచి తరలిరానున్న ఆదివాసీలు



సిడాం వారి నాలుగు గోత్రాల జెండాలు



పోతురాజు, ధర్మరాజు ఆలయం

కెరమెరి: కొలాం ఆదివాసీల కొంగుబంగారం.. మహిమాన్వితుడు, కోరిన కోర్కెలు తీర్చే దేవుడు పోతురాజు, ధర్మరాజుకు పూజలు నేటి నుంచి మండలంలోని ఇందాపూర్ గ్రామ సమీపంలో ఉన్న పోతురాజు ఆలయంలో ప్రారంభం కానున్నాయి. తమతమ ఆచార వ్యవహారాలను కాపాడడంలో ముందుండే ఆదివాసీలు నేటికి అదే ప్రధాను కొనసాగిస్తున్నారు. కొండకోనల్లో బస చేసిన ఆది దేవతను కొలవడం, పూజించడం, మొక్కులు తీర్చడం అనాధిగా వస్తుంది. ఉమ్మడి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచే కాకుండా తెలంగాణ రాష్ట్రం, మహారాష్ట్ర నుంచి కూడా వందలాదిగా భక్తులు తరలిరానున్నారు.

ఇది చరిత్ర..

క్రీస్తూకు పూర్వం 200 సంవత్సరాల క్రితం ఉత్నూరు పేట్ అనే ప్రాంతంలో ఇందాపురం అనే వంశస్తులు (కొలాం తెగకు చెందిన సిడాం గోత్రం వారు) నివసిస్తుండేవారు. పూరి గుడిసెల్లోనే వారి నివాసం. ఒక రోజు భయంకరంగా ఉరుములు మెరుపులు మెరిశాయి. ఆక్రమంలో ఒక మహిమ గల రాయి భువినుండి పైకి వచ్చింది. దాన్ని మళ్లీ భువిలోకి దించేందుకు మరో రాయితో కొట్టేవారు. అప్పుడే మాయమైన ఈ రాయి మళ్లీ తెల్లారే సరికి ప్రత్యక్షమై మరింత ఎత్తుకు పెరిగేది. అలా కొద్దిరోజులు వరసగా అదే పనిగా దాన్ని భువిలోకి దింపడం మళ్లీ ప్రత్యక్షం కావడం జరుగుతుండేది. ఓరోజు గ్రామ పెద్ద రాజు కలలోకి వచ్చి.. తాను పోతరాజు, ధర్మరాజు దేవున్ని ఇన్ని రోజులైన తనను గుర్తించలేదా.. మీ మంచి కోసమే నేను ప్రత్యక్షమయ్యాను అని చెప్పడంతో ఆ రోజు నుంచి నేటి వరకు ప్రతీ ఏడాది ప్రత్యేక పూజలు చేస్తున్నారు. పోతరాజ్ వెలిసిన ప్రాంతంలోనే పెద్దవాగు కూడా ప్రవహిస్తోంది. దాని పేరు సింగర్‌వాడి. ఆ వాగు అందచందాలను కనులారా తిలకించేందుకు నేటికి ప్రజలు అక్కడికి వస్తుంటారు.

పూజా కార్యక్రమాలు..

నేడు తెల్లవారు జామున ఉదయం 3 గంటలకు బోనం సమర్పించడం. 4 గంటలకు కట్టు కట్టుకట్టడం, గుడి ప్రదక్షిణలు చేయడం, ఉదయం 7 గంటలకు భక్తులకు ఆశీర్వాదం ఇవ్వడం. ఉదయం 8 నుంచి 10 గంటల వరకు భోజన కార్యక్రమం, 11 గంటలకు మైసమ్మ పూజ, మధ్యాహ్నం 1:30 గంటలకు అమ్మవారి పూజ, 2 గంటల నుంచి 4 గంటల వరకు మొక్కులు చెల్లించడం, సాంప్రదాయ నృత్యాలు, 17న ఉదయం నుంచి సాయంకాలం 5 గంటలకు లక్ష్మి పూజ, 6 గంటలకు దేవుళ్ల దేవతలను గుడిలో సాగనంపడం తదితర కార్యక్రమాలు నిర్వహిస్తారు.

కొలాం ఆదివాసీల ఇష్టదైవం



కొలాం ఆదివాసీల ఇష్టదైవమైన పోతురాజు, ధర్మరాజు ఉత్సవ కార్యాక్రమాలు సంగర్‌వాడిలో మూడు రోజులు కొనసాగనున్నాయి. ఉమ్మడి జిల్లాతో పాటు మహారాష్ట్రలోని వివిధ తాలుకాలో ఉన్న కోలాంలు భారీగా తరలిరానున్నారు. ప్రత్యేక పూజలు, నైవేద్యాలు సమర్పిస్తారు.

– సిడాం రాజు ఆలయ కమిటీ చైర్మన్

కోరికలు నెరవేరుతాయి.



కోరిన కోర్కెల తీర్చే దేవుడిగా అనేక మంది మొక్కుతారు. కులామతాలకు అతీతంగా భక్తులు తరలివచ్చి మనసులో ఉన్న కోరికలు కోరితే నెరవేరుతాయని భక్తుల నమ్మకం. భక్తులకు మధ్యాహ్న భోజన సదుపాయం కల్పించడం జరిగింది. అధికారులు, నాయకులు వస్తారు.

– సిడాం ధర్మూ, ఆలయ కమిటీ కార్యనిర్వాహక కార్యదర్శి

యువత క్రీడల్లో రాణించాలి



పోటీలు ప్రారంభిస్తున్న నాయకులు

బెజ్జూర్: యువత చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని బెజ్జూర్ ఎస్సై ప్రవీణ్ కుమార్ అన్నారు. కోనేరు అభిమానుల ఆధ్వర్యంలో తలాయి గ్రామంలో బుధవారం నిర్వహించిన వాలీబాల్ టోర్నమెంట్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ క్రీడలతో శారీరక దృఢత్వంతో పాటు మానసికోల్లాసం కలుగుతుందన్నారు. కార్యక్రమంలో నాయకులు సిడాం సకారాం, బషారత్ ఖాన్, శ్రీను, సాయి, తిరుపతి, దందేర ఇస్తారి, పుల్లూరి సతీష్ పాల్గొన్నారు.

చింతలమానెపల్లి: బాబాపూర్‌లో మండలస్థాయి వాలీబాల్ పోటీలు నిర్వహించారు. హనుమాన్ యూత్ ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీలలో బా బాపూర్ క్రిష్ణ జట్టు విజేతగా నిలవగా.. గణేష్ జట్టు రన్నరప్‌గా నిలిచింది. విజేతలకు ఉపాధిహామీ ఫీల్డ్ అసిస్టెంట్ బానోత్‌శ్యాంలాల్ మొదటి బహుమతి అందించగా, రెండో బహుమతిని కాంగ్రెస్ నాయకులు సుల్కారి ఉమా మహేశ్ అందజేశారు.

వాంకిడి: మండల కేంద్రంలోని జెడ్పీఎస్ఎస్ పాఠశాల ఆవరణలో వాలీబాల్ క్లబ్ వాంకిడి ఆధ్వర్యంలో బుధవారం వాలీబాల్ పోటీలు నిర్వహించారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గుర్నులె నారాయణ, లక్ష్మణ్ సేవా సదన్ ట్రస్ట్ చైర్మన్ గాదె అవినాష్, భారతీయ బౌద్ధ మహాసభ జిల్లా అధ్యక్షుడు అశోక్ మహోల్కర్, శివాలయం దేవస్థానం కమిటీ చైర్మన్ గాదె ప్రవీణ్, బౌద్ధ సమాజ్ వాంకిడి అధ్యక్షుడు విలాస్ పాల్గొని పోటీలు ప్రారంభించారు.

పెంచికల్‌పేట్: గ్రామీణ క్రీడల్లో భాగంగా మండలంలోని కమ్మర్‌గాం గ్రామంలో బుధవారం గ్రామీణ స్థాయి వాలీబాల్ టోర్నమెంట్‌ను బెజ్జూర్ మాజీ జెడ్పీటీసీ పద్రం పుష్పలత ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ యువత క్రీడలతో పాటు చదువుల్లో రాణించాలని అన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ మధునయ్య, సాయి, రాచకొండ కృష్ణ, శంకర్‌గౌడ్, కొలిపాక శ్రీనివాస్, చందు, బాపు, మల్లేష్, ప్రభాకర్ పాల్గొన్నారు.



బహుమతులు అందజేస్తున్న సభ్యులు



టోర్నమెంట్ ప్రారంభిస్తున్న ఎస్సై

ముగిసిన కబడ్డీ పోటీలు..

కెరమెరి: మండలంలోని చిన్నసాకడ(శ్యాంరావుగూడ)లో పెందోర్ జంగు స్మారకార్థం మూడు రోజుల క్రితం ప్రారంభమైన కబడ్డీ పోటీలు మంగళవారం ముగిశాయి. మొత్తం 32 జట్లు పాల్గొనగా అంబారావుగూడ జట్టు విజేతగా నిలిచింది. రెండో స్థానంలో అమృత్‌రావు జట్టు, మూడో స్థానంలో భజరంగ్‌వారియర్ జట్టు నిలిచింది. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ మోతిరాం, పెందోర్ మానిక్‌రావు, పెందోర్ దంబిరావు, పెందోర్ ఆనంద్‌రావు, తుకారాం, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఇంద్రాదేవి ఆలయంలో పుష్యమాసం పూజలు



పూజలు చేస్తున్న భక్తులు

ఇంద్రవెల్లి: మండల కేంద్రంలోని ఇంద్రాదేవి ఆలయంలో ఆలయ మహరాజ్ చహకటి సూర్యరావ్ ఆధ్వర్యంలో బుధవారం పుష్యమాస పూజలు నిర్వహించారు. ఇంద్రవెల్లి, ఉట్నూర్, గుడిహత్నూర్ మండలాల నుంచి భక్తులు తరలివచ్చారు. నైవేద్యాలు తయారు చేసి ఇంద్రాదేవికి సమర్పించారు. భక్తులు మారుతి, ప్రవీణ్, నాగోరావ్, భీంరావ్ పాల్గొన్నారు.